క్లుప్తంగా

26న ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 26న వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



శాంతినగర్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్‌లు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో కలిసారు. వడ్డేపల్లి మండలంలోని వివిధ సమస్యలను మంత్రికి వారు వివరించారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

నేటి నుంచి మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజోళి: మండలంలోని చిన్న ధన్వాడలో మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని తుంగభద్ర నది తీరంలో నిర్మించిన అమ్మవారి నూతన ఆలయ, దేవతా మూర్తుల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, 24, 25, 26 తేదీలలో ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం నిర్వహిస్తునట్లు వివరించారు.

ఉపాధ్యాయులను ధూషించడం సరికాదు



గద్వాల అర్బన్: వేర్వేరు ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయ దంపతులను ఒకే ప్రాంతానికి బదిలీ చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న స్కూల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన సంఘటన స్థలానికి చేరుకొని టీచర్లను ఉద్దేశించి మీరు రౌడీల్లా.. టీచర్లా అని ధూషించారని పేర్కొన్నారు. వెంటనే డైరెక్టర్ టీచర్లకు క్షమాపణ చెప్పాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాషా, డి హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న వైద్య పరీక్షలు

గద్వాల అర్బన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రాజ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు అలూరు బిలకంటి రాము వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు దామా భరత్, దామా వంశీ, దామా నవీన్‌లు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరం సోమవారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరహరి శ్రీనివాసులు, బాణాల వెంకటరమణ, బిలకంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ..

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో ఉన్న యూపీఎస్ పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని విద్యా కమిటీ అధ్యక్షుడు పెద్దింటి నాగేష్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. పాఠశాల రోడ్డు పక్కనే ఉండటంతో విద్యార్థులు ప్రమాదాలకు గురువుతున్నారని వాపోయారు. విష సర్పాలు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తామని పేర్కొన్నారు.

ఆటో సీజ్

మల్దకల్: కొంత మంది ఆటోడ్రైవర్లు నిబంధనలు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై శేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆదివారం ఓ ఆటోలో కెపాసిటీకి మించి కూలీలను తరలిస్తుండగా పెద్దపల్లి సమీపంలో ఆటోను ఎస్సై పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీకి భరోసా

- ప్రమాదబీమా రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షలు పెంపు
- మండలంలో 25,664 మంది..





ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కేటీదొడ్డి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు భరోసా కల్పించేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రమాదబీమా కల్పించింది. గతంలో ప్రమాద బీమా రూ.50లు చెల్లించేది. ప్రస్తుతం దీని రెట్టింపు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాదాబీమాను రూ.2 లక్షలు వరకు పెంచి కూలీలకు భరోసానిచ్చింది. కేంద్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంలో ఎంతోమంది నిరుపేదల ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. ప్రమాదవశాత్తు ఉపాధి కూలీలు మృతి చెందితే రూ.2 లక్షల పరిహారం ప్రకటించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పరిహారం పెంపుపై గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనం జరుగనుంది. ఉపాధిహామీ లో పనిచేస్తున్న సమయంలో కూలీలకు అనేక ప్రమాదాలు జరుగుతుంటాయి. దీనిని గుర్తించి ప్రమాదబీమా రెట్టింపు అవసరమని నిర్ణయించి అమలులోకి తీసుకొచ్చింది. ఉపాధి కూలీలకు తరుచుగా మట్టిపెల్లలు పడటం, ట్రాక్టర్లు, గడ్డపారలు, తగలడం వంటి తగిలి ప్రమాదాల పడుతారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతారు. ఇవే కాకుండా వడదెబ్బ పాముకాటు, గుండెపోటుతో మృతి చెందినా పరిహారం అందనుంది.

పరిహారం ఇలా..

మండలంలో మొత్తం 23 గ్రామాల పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 11,470 జాబ్‌కార్డులు, 25,664 మంది కూలీలు ఉన్నారు. ఈ ఏడాది 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు రూ.29,4072ల మంజూరు కాగా రూ.21,0566ల లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇప్పటి వరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. ఉపాధి హామీలో కూలీలు ప్రధానంగా నీటి నిల్వల పెంపునకు కందకాలు తవ్వకం, చెరువుల్లో పూడికతీత, కాలువ మరమ్మతులు, మొక్కల పెంపకం వంటి పనులు చేస్తారు. పనులలో గాయాలబారిన పడితే బాధితులకు ఈ. 25 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.50 వేలకు పెంచారు. ఇక చికిత్సకు అయ్యే ఖర్చును బట్టి లక్ష వరకు చెల్లిస్తారు. ఒకవేళ అంగవైకల్యం చెందితే గతంలో రూ. 50 వేలు చెల్లించేవారు. ప్రస్తుతం దానిని రూ. లక్ష వరకు పెంచారు. ప్రమాదంలో చాతినొప్పి, గుండెపోటు, వడదెబ్బతో మృతి చెందితే గతంలో రూ. 50 వేలు ఉండగా ఇప్పుడు రూ. 2 లక్షలు పెంచారు. రోజు వారి ఉపాధి పనులకు వచ్చే కూలీలకు భరోసా కల్పించేవిధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీమా పెంపు హర్షణీయం



ఉపాధిహామీ పనులు ఎక్కువగా నిరుపేదలే చేస్తారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూలీలకు ఎంతగానో ఉపయోగకరం. పని ప్రదేశాల్లో అనుకోకుండా ఏమైనా ప్రమాదాలు జరిగితే పరిహారం వచ్చేది. ఇప్పుడు రెట్టింపు చేయడం మంచి నిర్ణయం. రూ.2 లక్షల ప్రమాద బీమా బాధితుల కుటుంబాలకు ఎంతో మేలు.

– తాయప్ప, కూలీ, కేటీదొడ్డి

ఈ శ్రామ్ కార్డు తీసుకోవాలి



ఉపాధి కూలీలు ఈ శ్రామ్ కార్డు తీసుకోవాలి. ఈ కార్డు తీసుకున్న వారికి మాత్రమే ప్రమాదబీమా వర్తిస్తుంది. మీసేవ కేంద్రాలలో అందరు దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రమాద బీమా రెట్టింపు చేయడం కూలీలకు ప్రయోజనకరం.

– కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్

మదనాపురం: పేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చినా ఇళ్లు ఇస్తామని వాగ్దానం నెరవేరలేదన్నారు. ప్రస్తుతం సొంత స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి రూ.3 లక్షల ఇస్తామంటూ మోసం చేస్తున్నారని ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి హరీష్‌రావు ఇళ్లపై అనేక మార్లు ప్రకటనలు చేశారని తెలిపారు. మండలంలో బుడ్డలు, రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాడం లేదన్నారు. కార్మికుల పక్షాన మా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య చీలిక తెస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులకు రూ.11 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసి పేదలపైన జీఎస్టీ పేరుతో అదనపు భారం మోపుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, వెంకట రాములు, మన్యం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకుడు మారెప్ప

అమరచింత: మక్తల్ పట్టణంలో ఈనెల 26న అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ ఉంటుందని బీఎస్పీ నాయకుడు మారెప్ప తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు విగ్రహ ఆవిష్కరణ 4 గంటలకు నెహ్రూగంజ్‌లో బహిరంగసభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, లింగన్న, రాములు, పెద్ద అంజప్ప పాటు పలువురు పాల్గొన్నారు.

సంగీత కచేరిలో గట్టు మాస్టర్ ప్రతిభ



మాస్టర్ ఈరన్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

గట్టు: త్యాగరాజస్వామి సంగీత కచేరిలో గట్టుకు చెందిన మాస్టర్ గట్టు ఈరన్న కచేరి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని నాగులదిన్నెలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ప్రదర్శనలిచ్చారు. ఈ ప్రదర్శనల్లో గట్టుకు చెందిన మాస్టర్ గట్టు ఈరన్న సక్సఫోన్ ద్వారా ప్రదర్శన నిర్వహించారు. వీరికి సహాయకుడిగా బోయలగూడెనికి చెందిన రమేష్ వాయిద్య సహకారం అందించారు. వీరిద్దరి ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. సంగీత కచేరి అనంతరం నిర్వాహకులు మాస్టర్ గట్టు ఈరన్నతో పాటుగా బోయలగూడెం రమేష్‌లను నిర్వాహకులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు.

నేటి నుంచి జములమ్మ ఉత్సవాలు

అమరచింత: పట్టణంలో వెలసిన జములమ్మ దేవతా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. 23న అమ్మవారి వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలను పట్టణంలోని మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం నుంచి జములమ్మ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీనియర్ నాయకుడి మృతికి నివాళి

పెబ్బేరు: మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని మాజీ వార్డు సభ్యుడు కుమ్మరి అచ్చన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. డీసీసీ కార్యదర్శి సత్యారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో శ్రీనివాస్‌గౌడ్, రాములుయాదవ్, వెంకట్రాములు, రంజిత్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిగౌడ్, భాను తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- 24 నుంచి ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- అంతర్రాష్ట్ర బండలాగుడు ఏర్పాటు



ధన్వంతరి వేంకటేశ్వరస్వామి మూల విగ్రహం



ముస్తాబైన గుండ్ల భీమరాయస్వామి ఆలయం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ఈనెల 24 నుంచి 30 వరకు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

పూజల వివరాలు

ఉత్సవాల సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, బిందెసేవ, పంచామృత అభిషేకం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, వాస్తుహోమం, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అజురార్పణ, అంకురార్పణ హోమం, భేరీపూజ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, గరుడ ప్రసాద వితరణ, నివేదన, హారతి శాత్తుమొరై, తార్థగోష్ఠి పూజలు నిర్వహించనున్నారు.

26న రథోత్సవం

ఈనెల 24న ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భక్తుల సంతానప్రాప్తికి గరడ ప్రసాదం ఇవ్వనున్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజన పోటీలు నిర్వహించనున్నారు. 25న శ్రీవారి కల్యాణ మహోత్సవం, 26న శ్రీవారి రథోత్సవంతోపాటు నాలుగుపళ్ల విభాగం వృషభ రాజుల బల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 27న మొండిసట్టం, శేషవాహన కార్యక్రమాలతో పాటు ఆరుపళ్ల విభాగం వృషభ రాజుల బల ప్రదర్శన, 28న చక్రస్నానం, ధ్వజారోహణం, పుష్పయాగం, ఏకాంతసేవతోపాటు న్యూ క్యాటగిరి విభాగం వృషభరాజుల బల ప్రదర్శన, 29న సబ్ జూనియర్ విభాగం, 30న సీనియర్స్ విభాగం వృషభరాజుల బల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. 30న గుండ్లు, సందెరాళ్లు, ఇసుక సంచులు ఎత్తుపోటీలు నిర్వహించనున్నారు.

తొత్తినోనిదొడ్డిలో..

మండలంలోని తొత్తినోనిదొడ్డిలో ఈనెల 25 నుంచి 29 వరకు గుండ్ల బీమరాయ స్వామి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం స్వామివారి పల్లకిసేవ, ప్రభోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం రథోత్సవం, శుక్రవారం ఓపెన్ ఆల్ కబడ్డీ పోటీలు, సందెరాళ్లు, దొబ్బడి గుండ్లు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలతో పాటు ఇసుక సంచులు ఎత్తే పోటీలు ఏర్పాటు చేశారు. శనివారం పొటేళ్ల పోటీలు, ఆదివారం సేద్యపుటెద్దుల విభాగం వృషభరాజుల బండలాగు పోటీలు నిర్వహించనున్నారు.

రహదారి మరమ్మతు చేపట్టాలి



గుంతలమయంగా బిజ్వారం- సంగాల గ్రామాల మధ్య రహదారి

మల్దకల్: మండలంలోని బిజ్వారం, సంగాల గ్రామాల మధ్య ఉన్న బీటీ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ఆయా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై ప్రతినిత్యం వందలాది వాహనాలతో పాటు గద్వాల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రాకపోకలు సాగిస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని గ్రామస్తులు తిమ్మప్ప, మహ్మద్‌లు అధికారులు కోరారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం



బిజ్వారంలో ఉన్న కమ్యూనిటీ భవనం

మల్దకల్: మండలంలోని బిజ్వారంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.6 లక్షల వ్యయంతో 18 ఏళ్ల కిందట కమ్యూనిటీ భవనంను నిర్మించారు. ఎవరు వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనంను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు వినియోగంలోకి తేవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట గ్రామంలోని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు వినియోగంలోకి తీసుకురావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు ఆధ్వర్యంలోని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధి సమీపంలోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి కనెక్షన్ ఇవ్వకుండా అలాగే వదిలేశారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కిరాణ దుకాణాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారని వివరించారు. నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు అంజి, ఏసన్న, భీమన్న, ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు



పూజలు నిర్వహిస్తున్న మహవీర్ భక్తులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో మహవీర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం ఆలయంలో ఆచార్య తీర్థ బద్ర సుర్జి ఆధ్వర్యంలో విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. భగవాన్ మహవీర్ స్వామిజీ, చౌముకి భగవాన్ స్వామిజీ, ఆదిస్వర్ భగవాన్, పర్షనంత్ భగవాన్ స్వామిజీలు విగ్రహాలకు, ఆలయ గోపురం కలశాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అయిజ: పట్టణంలోని కోట్ల వీధికి చెందిన షరీఫ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మెకానిక్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబసభ్యులకు రూ.1.17 లక్షల ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి రూ.25 వేలు అందజేశారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కమిటీ మెంబర్ జమాలుద్దీన్, అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబర్ రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు విద్యారుణాలు



రుణాలు అందజేస్తున్న సోమ భరత్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ అవకాశాలు ఇస్తున్నారని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో 101 మంది విద్యార్థులకు రూ.28లక్షల వడ్డీలేని విద్యారుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఉప్పల శివకుమార్ ఐపీఎస్, ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా, సామాన్య ప్రజలకు సేవలందించే విధంగా ముందుకు రావాలని కోరారు. విద్యారుణాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి కండె కుమారస్వామి, కోశాధికారి కలకొండ సూర్యనారాయణ, సలహాదారు గుండ్ల కృష్ణయ్య, జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు పాలాది రాంమోహన్, మిర్యాల వేణుగోపాల్, కొండ చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.